సాక్షి
విశాఖపట్నం
శనివారం । 9 । మార్చి । 2024


ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటు చేసిన కోటి శివలింగాలు

ఆర్.కె.బీచ్‌లో శివలింగానికి అభిషేకం చేస్తున్న శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర స్వామి, సుబ్బరామిరెడ్డి

న్యూస్‌రీల్

చిరుధాన్యాలతో శివుడు


చిరుధాన్యాలతో పరమేశ్వరుడి రూపం

ఏయూక్యాంపస్: మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలు విభిన్న రూపాల్లో నిర్వహించుకుంటారు. నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ తన వైవిధ్యమైన కళా ప్రతిభతో పరమేశ్వరుని చిత్రానికి రూపమిచ్చారు. చిరుధాన్యాలను వినియోగించి మూడు అడుగుల పొడవు, రెండు అడుగుల వెడల్పు కలిగిన పరమేశ్వరుని చిత్రాన్ని దాదాపు పది రోజులు శ్రమించి తీర్చిదిద్దారు.

విద్యాశాఖ ఆర్జేడీగా విజయభాస్కర్


విజయభాస్కర్

విశాఖ విద్య: విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)గా బి. విజయభాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఎస్ఏఎంవో)గా పనిచేస్తున్న విజయభాస్కర్‌ను విశాఖపట్నం ఆర్జేడీగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఆర్జేడీగా పనిచేస్తున్న ఎం.జ్యోతి కుమారిని ఆ స్థానం (ఎస్ఏఎంవో)కు బదిలీ చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు గుడ్ న్యూస్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో ఇంతవరకు కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నవారిని పర్మినెంటు ఉద్యోగులుగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు చేయనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రెగ్యులర్ అయిన ఉద్యోగుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తామన్నారు. వీటి కోసం ఐదు బృందాలను నియమించామన్నారు. మొత్తం 327 మంది ఉద్యోగుల్లో తొలి విడత కింద 98 మంది సర్వీస్ పర్మినెంటు అవుతోందని అన్నారు. 72 ఎంపీహెచ్ఎ(మేల్), ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఏడుగురు ఫార్మసిస్టులు గ్రేడ్-2-, 13 మంది ఎంపీహెచ్ఎ (ఫిమేల్) ఉద్యోగులు ఉన్నారని డీఎంహెచ్‌వో వివరించారు.

అటవీ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించం

ఆరిలోవ : అటవీ భూములను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించబోమని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీరాం నరేష్ హెచ్చరించారు. అటవీ సిబ్బందితో కలిసి జోడుగుళ్లపాలెం వద్ద నాగేంద్ర స్వామి అలయం వద్దకు గురువారం వెళ్లినట్లు తెలిపారు. అక్కడ అటవీశాఖ స్థలం ఆక్రమించి అక్రమంగా నిర్మించిన గుడి, మరికొన్ని భవనాలను ఖాళీ చేయాలని నోటీస్ ఇవ్వడానికి ప్రయత్నించామన్నారు. రెండు వారాల గడువులోగా ఆ స్థలానికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉంటే అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో అధికారులకు సమర్పించాలని ఇక్కడ భూ కబ్జాకు పాల్పడిన ప్రభాకర్ యోగికి సూచించామన్నారు. చట్టం ప్రకారం ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టి వెళ్లాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదని సూచించామన్నారు. దీంతో అటవీ సిబ్బందిపై ప్రభాకర్ యోగి, అతని అనుచరుడు ఆడారి కిశోర్‌కుమార్ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇక్కడ స్థలంపై 2012లో పలు కేసులు కూడా నమోదుచేసినట్లు తెలిపారు. ఎంతో విలువైన అటవీ భూములు ఆక్రమించే ప్రయత్నం చేసిన ప్రభాకర్ యోగిపై మరో కేసు ఇప్పుడు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ మానసిక వైద్య శాల పరిధిలో ఉన్న ఒపియాయిడ్ ప్రత్యామ్నాయ చికిత్స కేంద్రంలో ఓ వైద్యాధికారి పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వ మానసిక వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ కేవీ రామిరెడ్డి తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 11 నుంచి 14 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంట వరకు కార్యాలయం పనిదినాల్లో మాత్రమే సమర్పించాలన్నారు.

హర హర మహాదేవ


ఎంవీపి కాలనీలో జ్యోతిర్లింగ శివాలయంలో భక్తుల పూజలు

- జిల్లాకు శివరాత్రి శోభ
- భక్తులతో కిటకిటలాడిన తీరం
- శివరాత్రి స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

బీచ్‌రోడ్డు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ముక్కంటి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువ జాము నుంచే దేవాలయాలు కిటకిటలాడాయి. క్యూలైన్లలో బారులు తీరి భోళాశంకరుడికి అభిషేకాలు నిర్వహించుకున్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యే పూజా కార్యక్రమాలు జరిగాయి. జిల్లా అంతటా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆర్కేబీచ్ వద్ద..

సాగరతీరం శివ నామస్మరణతో హోరెత్తింది. తీరంలో ఏర్పాటు చేసిన కోటి లింగాల మహా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రంతా జాగారం ఉండేందుకు ఇక్కడ ఏర్పాట్లు చేశారు. తీరంలో పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. మహాకుంభాభిషేకంలో శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సర్వస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, కేంద్ర మాజీ మంత్రి సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

బారులుదీరిన భక్తులు..

మాజీ కేంద్ర మంత్రి టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోటి లింగాల మహా కుంభాభిషేకానికి భక్తులు బారులుదీరారు. భక్తులు స్వయంగా అభిషేకం చేస్తూ భక్తితో పరవశించి పోయారు. వివిధ సంస్థలు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశాయి.


శివలింగానికి అభిషేకం


జలాభిషేకం


దీపం సమర్పయామి..

శివరాత్రి స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

మహా శివరాత్రి సందర్భంగా భక్తులు రాత్రంతా జాగారం చేసి శనివారం ఉదయం సముద్ర స్నానాలు ఆచరించనున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా జీవీఎంసీ, పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. స్నానాలు చేసిన అనంతరం వస్త్రాలు మార్చుకునేందుకు తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


ఆర్కే బీచ్‌లో మహాకుంభాభిషేకంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు


స్నానమాచరించేందుకు వచ్చే భక్తుల కోసం..


లింగాలతిరుగుడులో కోటి దీపార్చన

ఆ రైల్లో అంతా మహిళలే..

ప్రత్యేక మహిళా రైలును నడిపిన వాల్తేర్ డివిజన్

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ అందరూ మహిళా సిబ్బందితో ప్రత్యేక రైలును నడిపి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాల్తేర్ డివిజన్ విశాఖపట్నం-భవానిపట్న(08504) పాసింజర్ స్పెషల్ రైలును పూర్తి మహిళా సిబ్బందితో నడిపింది. శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ ఈ ప్రత్యేక రైలుకు ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్‌లో మహిళలు రైళ్ల నిర్వహణ, ఆపరేషన్స్, కమర్షియల్ వంటి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారనడానికి ఈ ప్రత్యేక రైలు నిదర్శనమని ఆమె తెలిపారు. ఈ ప్రత్యేక రైలు స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ నేతృత్వంలో ఝాన్సీరాణి లోకోపైలట్‌గా, సాధనా కుమారి సహపైలట్‌గా, శ్రీరమ్య ట్రైన్ మేనేజర్‌గా వ్యవహరించారు. డివిజనల్ రైల్వే మేనేజర్‌చే ఉత్తమ రైల్ సేవా పురస్కార్ అవార్డు అందుకున్న రాణి ఝాన్సీ గ్రూప్ ఈ రైలుకు చెకింగ్ సిబ్బందిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్‌లు మధుస్మిత సాహూ, కవితా గుప్తా, జాయింట్ సెక్రటరీ సంయుక్త ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళా సిబ్బందితో బయల్దేరుతున్న ప్రత్యేక రైలును ప్రారంభిస్తున్న మంజుశ్రీ ప్రసాద్

ఘనంగా మహిళా దినోత్సవం

బీచ్‌రోడ్డు: నేటి యాంత్రిక జీవనంలో మహిళలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని సహజ యోగ ట్రస్ట్ రాష్ట్ర ప్రతినిధి పద్మావతి సింహాద్రి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ ఒత్తిళ్లను జయించేందుకు సహజ యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అనేక రంగాల్లో కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ ట్రస్ట్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ సుభాషిణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..


వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ

మహిళల ఆరోగ్యంపై వాక్‌థాన్..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెయిన్ బో చిల్డ్రన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్‌రోడ్డులో మహిళ ఆరోగ్య ప్రాముఖ్యతపై అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రారంభించారు. వాక్‌థాన్‌లో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

మహిళలు మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలి

సమాజంలో మహిళలు మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని డీఐజీ సునీల్ గున్ని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా వైఎంసీఏ సమావేశ మందిరంలో వివిధ రంగాల్లో ప్రతిభకనబరిచిన మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ హోదాల్లో కొనసాగుతున్న మహిళలకు గుర్తించి సన్మానించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఈజెడ్ కమిషనర్ రోష్ని అపరంజి, వైభవ్ ఎండీ మల్లిక మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.12 లక్షల స్వాధీనం

ఆనందపురం : మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు చెక్ పోస్టు వద్ద జరిపిన తనిఖీల్లో గురువారం రాత్రి రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ టీవీ తిరుపతిరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాహన తనిఖీలో భాగంగా విజయనగరం నుంచి వస్తున్న కారును చెక్ పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. ఈ మేరకు కారులో ప్రయాణిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం గ్రామానికి చెందిన బండి సూర్య చంద్రరావు వద్ద రూ.12 లక్షలు బయటపడింది. ఈ మేరకు అతనిని విచారించగా తాను వెల్లుల్లి హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నానని ఆముదాలవలస, పార్వతీపురం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల వ్యాపారుల నుంచి సరుకు అమ్మగా వచ్చిన మొత్తాన్ని తీసుకొస్తున్నట్టు వివరించారు. ఈ విషయమై సీఐ తిరుపతి రావు మాట్లాడుతూ నగదు కలిగిన వ్యక్తి తెలిపిన వివరాలు ప్రకారం విచారణ జరుపుతున్నామన్నారు. ఆధారాలు చూపకపోతే కేసు నమోదు చేసి నగదుని సీజ్ చేస్తామని తెలిపారు.

పోలీసు ముసుగులో కేటుగాళ్లు


ప్రవీణతో రమేష్ (ఫైల్)

- రూ.3 కోట్లకు ముంచేశారు
- టూ టౌన్ ఎస్ఐగా అవతారమెత్తిన సస్పెండైన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్
- రైల్వేలో ఉద్యోగాల పేరుతో మోసం
- ఒక్కొక్కరి నుంచి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వసూలు
- ముగ్గుర్ని పెళ్లాడిన ఘనుడు
- ఆమెకూ పోలీస్ డ్రెస్ వేసి యువతకు వల
- డమ్మీ పిస్టల్‌తో బెదిరించి పరారైన నిందితులు
- మిస్సింగ్ కేసు దర్యాప్తులో అసలు వ్యవహారం బట్టబయలు..?
- పోలీసుల అదుపులో రమేష్, ప్రవీణ

విశాఖ సిటీ: ఒక మిస్సింగ్ కేసు.. పెద్ద మిస్టరీని బట్టబయలు చేసింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను రూ.3 కోట్లకు ముంచేసిన ఘరానా నకిలీ పోలీసు వ్యవహారమిది. ఎస్ఐగా అవతారమెత్తి.. తన చేతిలో మోసపోయిన యువతినే బుట్టలో వేసుకొని.. ఆమెతో కలిసి అనేక మందిని దోచుకున్న సస్పెన్షన్‌కు గురైన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ హనుమంతు రమేష్ (47) వ్యవహారం ఇపుడు నగరంలో సంచలనం రేకెత్తిస్తోంది. రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు వసూలు చేసిన దగ్గర నుంచి.. నకిలీ రైల్వే వెబ్‌సైట్ తయారీ.. హాల్ టికెట్ల జారీ.. విజయవాడలో ఒక హోటల్‌లో ఉత్తుత్తి ప్రవేశ పరీక్ష నిర్వహణ.. హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో ఇంటర్వ్యూల పేరుతో హడావుడి.. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ.. ఇలా అనేక మంది నిరుద్యోగులను నిలువు దోపిడీ చేసిన ఆ రహస్య దంపతుల తెలివితేటలకు పోలీసులు సైతం విస్తుపోయారు. వివరాల్లోకి వెళితే..

విధుల్లో నిర్లక్ష్యంతో సస్పెన్షన్

శ్రీకాకుళం జిల్లా మొళియాపుట్టు ప్రాంతానికి చెందిన హనుమంతు రమేష్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ పనిచేస్తున్నాడు. 2022 సంవత్సరంలో జమ్మూ కాశ్మీర్‌కు బదిలీ అయినప్పటికీ అతడు విధుల్లో చేరలేదు. దీంతో దీర్ఘకాలం సెలవు తీసుకోవడంతో సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు అతడ్ని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం రమేష్ పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో అడవివరం ప్రాంతంలో ఆర్‌ఆర్ టవర్స్‌లో నివాసముంటున్నాడు.

ఎస్ఐగా అవతారమెత్తి..

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా సస్పెన్షన్‌కు గురైన రమేష్ విశాఖ టూటౌన్ ఎస్ఐగా అవతారమెత్తాడు. తన నివాస ప్రాంతంలోనే కాకుండా పెందుర్తిలో కొన్ని సామాజిక వర్గాల పెద్దలను పరిచయం చేసుకున్నాడు. రైల్వే శాఖలో కొంత మంది ఉన్నతాధికారులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని అందరికీ చెప్పుకొచ్చాడు. రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో అనేక మంది నిరుద్యోగులు రమేష్ మాటలు విశ్వసించి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు సమర్పించుకున్నారు.

యువతులకు వల..

రమేష్ యువతులకు వల వేయడంలో సిద్ధహస్తుడు. ముందు ఒక మహిళను వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఆమె అక్కపై కన్నేసి ఆమెను కూడా పెళ్లాడాడు. ఆ ఇద్దరితోనే ఆగిపోలేదు. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ అనే యువతి నుంచి కూడా రమేష్ రూ.15 లక్షల వరకు డబ్బు తీసుకొని మోసం చేశాడు. ఉద్యోగం రాకపోయే సరికి ప్రవీణ తండ్రి రమేష్‌ను గట్టిగా నిలదీశాడు. దీంతో అతడు తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేశాడు. అయితే ప్రవీణను మాత్రం సింహాచలంలో రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. రమేష్‌తో కలిసి ప్రవీణ కూడా పోలీస్ అని చెప్పుకుంటూ నిరుద్యోగులకు వల వేసింది.

డమ్మీ పిస్టల్‌తో బెదిరించి

రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో అభ్యర్థులు రమేష్‌ను నిలదీయడం ప్రారంభించారు. ఒకసారి అతడి ఇంటికి వెళ్లి వాగ్వాదానికి దిగారు. తమకు డబ్బులు ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో రమేష్ తన వద్ద ఉన్న డమ్మీ మెటల్ పిస్టల్‌ను చూపించి వారిని బెదిరించాడు. అనంతరం విశాఖ నుంచి ప్రవీణతో కలిసి పరారయ్యాడు.

మిస్సింగ్ ఫిర్యాదుతో వెలుగులోకి?

తన భర్త కనిపించడం లేదని రమేష్ భార్య ఈ ఏడాది జనవరి 24వ తేదీన పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో అనేక విస్తుపోయే వాస్తవాలు పోలీసుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. వారికి అందిన సమాచారం ప్రకారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రమేష్, ప్రవీణలపై నెల రోజుల పాటు నిఘా పెట్టారు. సాంకేతికత సహాయంతో వారు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇదే సమయంలో కొంత మంది బాధితులు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదులు ఆధారంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లి రమేష్, ప్రవీణలను అదుపులోకి తీసుకున్నారు.

రహస్యంగా విచారణ..

నిరుద్యోగులను నిలువునా ముంచిన ఇద్దరినీ పోలీస్ ఉన్నతాధికారులు రహస్యంగా విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉండడంతో వివరాలు వెల్లడించడం లేదు. అయితే ఇప్పటికే కీలకమైన ఆధారాలు సేకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే వీరిని అరెస్టు చూపించే అవకాశాలు ఉన్నాయి.

నకిలీ వెబ్‌సైట్.. ఉత్తుత్తి పరీక్ష

నిరుద్యోగులను నుంచి రూ.కోట్లు కాజేసేందుకు రమేష్, ప్రవీణ అడుగడుగునా మోసాలకు తెరతీశారు. అభ్యర్థులను నమ్మించేందుకు వీరు ఏకంగా నకిలీ రైల్వే వెబ్‌సైట్‌ను రూపొందించారు. దాని ద్వారా అభ్యర్థులకు మెయిల్స్ ద్వారా ఉద్యోగ సమాచారాన్ని పంపించే వారు. నకిలీ హాల్ టికెట్లు జారీ చేశారు. విజయవాడలో ఒక హోటల్‌లో ఉత్తుత్తి పరీక్ష సైతం నిర్వహించారు. అంతటితో ఆగకుండా కొద్ది రోజులకు ఇంటర్వ్యూ ఉందని హైదరాబాద్‌లో డీఆర్ఎం కార్యాలయానికి రావాలని మెసేజ్‌లు పంపించారు. అభ్యర్థులు అక్కడికి వెళ్లగా రమేష్ వారిని రిసీవ్ చేసుకున్నాడు. ఉన్నతాధికారులతో మాట్లాడి వస్తానని చెప్పి కొంత సేపు కార్యాలయంలో తిరిగి వచ్చాడు. ప్రస్తుతం అధికారులు బిజీగా ఉన్నారని మరోసారి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పి అభ్యర్థులను అక్కడి నుంచి పంపించేశాడు. వీరికి ఉద్యోగాలు వచ్చేశాయని నకిలీ నియామక పత్రాలు చూపిస్తూ మరికొంత మంది నుంచి కూడా డబ్బులు వసూలు చేశాడు.

- భీమిలి తెరపై కొత్త అభ్యర్థి!
- నమ్మించి మోసం చేశారని చంద్రబాబు, లోకేష్‌పై అతని వర్గం ఆగ్రహం

బలిపశువు రాజబాబు?

తగరపువలస: భీమిలి ప్రస్తుత తెలుగుదేశం ఇన్‌చార్జి బలిపశువు కాబోతున్నారా? టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థిగా వారి అధిష్టానాలు పక్క చూపులు చూస్తున్నాయా? అంటే.. అవుననే అంటున్నాయి ప్రస్తుత పరిస్థితులు. భీమిలి అసెంబ్లీ టికెట్ విజయనగరం జిల్లా నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజుకు ఖరారు చేసినట్లు వార్తలు రావడంతో ప్రస్తుత ఇన్‌చార్జి కోరాడ రాజబాబు వర్గం ఆగ్రహంతో రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి వరకు కోరాడ రాజబాబు అయ్యన్నపాత్రుడితో సమావేశం అయినట్టు తెలిసింది. భీమిలిని కేటాయించడానికి బంగార్రాజు పార్టీకి రూ.10 కోట్లు, గంటా, అచ్చెన్నాయుడుకు రూ.కోటి వంతున ఇచ్చినట్టు రాజబాబు వర్గం ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం రాజబాబు వర్గం నగరంలోని ఒక హోటల్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అధినాయకత్వం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో జరిగిన యువగళంలో చంద్రబాబు, ఇటీవల మాడుగులలో జరిగిన శంఖారావంలో లోకేష్ రాజబాబుకే టికెట్ ఇస్తామని నమ్మించి ఇప్పుడు ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు భీమిలిలో టికెట్ ఇచ్చేది లేదని టీడీపీ అధినాయకత్వం తెగేసి చెప్పేసిందని రాజబాబు వర్గం చెబుతోంది. ఇన్నాళ్లూ కష్టపడిన వారిని కాదని కర్రోతు బంగార్రాజును భీమిలికి దిగుమతి చేసుకోవడం దారుణమని వాపోతున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు పత్రికా ప్రకటన ద్వారా అధిష్టానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో భీమిలి ఓటర్లకే తెలియని సబ్బం హరిని ఇక్కడ అభ్యర్థిగా నిలపడంతో ఎమ్మెల్యేతో పాటు విశాఖ ఎంపీ స్థానం కోల్పోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పుడు భీమిలికి చెందిన వారికి కాకుండా పక్క జిల్లాకు చెందిన బంగార్రాజు పేరుతో సర్వే చేయించడం చంద్రబాబు తొందరపాటు చర్యగా భావిస్తున్నారు. అనంతరం గీతం విద్యాసంస్థల అధినేత భరత్‌ను కలిసి.. ఇదే విషయాన్ని హెచ్చరించినట్లు సమాచారం. అలాగే టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిసేందుకు రాజబాబు వర్గం శ్రీకాకుళం జిల్లాలోని ఆయన ఊరు నిమ్మాడకు వెళ్లారు. తనకంటే చిన్నస్థాయి నాయకుడైన బంగార్రాజును నెల్లిమర్ల నుంచి భీమిలి తీసుకురావడంపై రాజబాబు కూడా తీవ్రంగా మండిపడుతున్నారు. తాను గత నెల 4వ తేదీ నాటికే డబ్బులు చూపిస్తానని చెప్పినా చంద్రబాబు, లోకేష్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా నెల్లిమర్ల సీటు అక్కడ జనసేన అభ్యర్థి మాధవికి కేటాయించడంతో గుర్రుగా ఉన్న బంగార్రాజును భీమిలి తీసుకువచ్చి సర్వే పేరుతో బలిపశువును చేయడానికే ఈ ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆ**రోపణలు వినిపిస్తున్నాయి. పోలిపల్లి**లో జరిగిన **యువగళంలో రూ.3.50 కోట్ల వరకు** ఖర్చు చేసిన **బంగార్రాజును ఏమార్చడానికే టీడీపీ**–జనసేన ఈ **తతంగం నడుపుతున్నట్లు తెలు**స్తోంది. మరో **వైపు భీమిలి టికెట్ జనసేనకు కేటా**యించే పరిస్థితి **లేదని టీడీపీ నాయకులు స్పష్టం** చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గొంతు కోసుకున్న వెంకటరమణ

మధురవాడ: పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్ ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ.. గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో సాయిరాం కాలనీ డ్రైవర్స్ కాలనీకి చెందిన జి.వెంకటరమణ బైక్ నడుపుతూ కార్‌షెడ్‌కు చేరుకున్నాడు. పోలీసులకు అనుమానం వచ్చి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేశారు. దీంతో అతను మద్యం తాగినట్టు నిర్ధారణయింది. పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తనకు బండి చాలా అవసరమని, ఎలాగైనా ఇవ్వాలని కోరాడు. ఉదయం డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇతర పత్రాలను చూపించి వాహనం తీసుకువెళ్లాలని చెప్పారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు స్టేషన్‌కు వచ్చి వాహనం అడిగాడు. ఎస్‌ఐ వచ్చిన తర్వాత పత్రాలు పరిశీలించి ఇస్తామని సిబ్బంది చెప్పారు. దీంతో అతను తన బండి వద్దకి వెళ్లి బ్లేడుతో చేయి మణికట్టు, గొంతు కోసుకున్నాడు. రక్తస్రావం కావడంతో పోలీసులు తక్షణమే స్పందించి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాణాపాయం లేదని చెప్పి, వైద్యులు డిశ్చార్జ్ చేశారని ఎస్‌ఐ ఎం.వెంకటరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

జూడోలో కీర్తి పతాక

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీలో పోటీలు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

తగరపువలస: జూడోలో విశేష ప్రతిభ కనబరుస్తున్న కీర్తి జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు దాతల సాయం అర్థిస్తోంది. న్యూఢిల్లీలో కె.డి జాదవ్ ఇండోర్ స్టేడియంలోని ఐజీ కాంప్లెక్స్‌లో జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు జాతీయస్థాయి జూడో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు బంగ్లామెట్టకు చెందిన పాలెపు కీర్తి ఎంపికైంది. భీమిలిలోని ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆమె బీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ పోటీలకు హాజరయ్యేందుకు అవసరమైన ఖర్చులు, సరైన జూడోగి(జూడో ప్రాక్టీస్, పోటీ కోసం ఉపయోగించే యూనిఫాం) లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. సరైన శిక్షణ, పౌష్టికాహారం లేకపోయినా జపనీస్ యుద్ధ కళ అయినా జూడోలో ఆమె రాష్ట్రస్థాయి వరకు ఎదిగింది. ప్రస్తుతం న్యూఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో 20 ఏళ్ల కీర్తి 70 కిలోల విభాగంలో తలపడనుంది.

సెలవు రోజుల్లో పనికి..: బంగ్లామెట్టపై శిథిలమైన ఇంటిలో తల్లిదండ్రులు నాగరాజు, కుమారి, సోదరుడు రాకేష్‌తో కీర్తి జీవనం సాగిస్తోంది. తండ్రి తోపుడు బండిపై ఐస్‌లు విక్రయిస్తూ కుటుంబాన్ని అతి కష్టంమీద నెట్టుకొస్తున్నాడు. కుటుంబానికి అండగా కళాశాల సెలవుల సమయంలో వెల్లంకిలోని రొయ్యల ఫ్యాక్టరీలో కూలి పనులకు కూడా కీర్తి వెళ్తోంది. చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ పీఈటీ పుణ్యవతి ప్రోత్సాహంతో ఆమెలో ఈ పోరాట క్రీడ బయటపడింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో గోల్డ్‌మెడల్ దక్కించుకోగా ఇంటర్మీడియట్‌లో పలు రజత, కాంస్య పతకాలు గెలుచుకుంది. జాతీయస్థాయి క్రీడలో పాల్గొనడానికి ఆమెకు జూడోగి లేకపోవడంతో తన సహచర క్రీడాకారిణిని అర్థించింది.

రేపే పయనం



జూడో పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీ ఉదయం బయలుదేరుతున్నాను. ఒకరిద్దరి సాయంతో ఢిల్లీ వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు సమకూర్చుకున్నాను. వెళ్లి రావడానికి మొత్తం రూ.12 వేలు ఖర్చవుతుంది. ఇవి కాకుండా మంచి జూడోగి అవసరం ఉంది. దాతలు స్పందిస్తే జాతీయస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపుతాను. 86399 59646, 77802 09859 నంబర్లలో సంప్రదించి సాయం చేయండి ప్లీజ్.

–పాలెపు కీర్తి, బంగ్లామెట్ట, తగరపువలస

- మాడుగుల నియోజకవర్గంలో ప్రగతి పరుగులు
- విద్య, వైద్య రంగాలలో గణనీయమైన మార్పులు
- జల్‌జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు
- రైతన్నకు భరోసా.. వ్యవసాయ రంగానికి పెద్దపీట
- సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం
- నియోజకవర్గంలో రూ.4,068 కోట్లతో కనివినీ ఎరుగని సంక్షేమాభివృద్ధి



ప్రతి రోజూ పండగే

వస్తూవస్తూనే సచివాలయ వ్యవస్థను తెచ్చారు. గ్రామీణ రంగాన్ని బలోపేతం చేశారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ చూడని సంక్షేమం.. అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సాధ్యమైంది. మాడుగుల నియోజకవర్గం రూపురేఖలే మారిపోయాయి. సుసంపన్న ప్రాంతంగా అవతరించింది. ఈ ప్రాంత ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు డిప్యూటీ సీఎం కావడం.. స్వయానా పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉండడంతో గ్రామగ్రామాన ప్రగతి వెలుగులు నిండేలా శ్రద్ధ తీసుకున్నారు. స్వగ్రామం తారువలోనే తన క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని, ఎప్పటికప్పుడు ప్రగతి పనులను పర్యవేక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఏకంగా రూ.4,068 కోట్లతో కనీవినీ ఎరుగని సంక్షేమాభివృద్ధిని సాధించారు.

మాడుగుల: రోజుకో మండలంలో ప్రారంభోత్సవం.. రోజుకో గ్రామంలో సంబరం.. రహదారులు, ఆస్పత్రులు, మంచినీటి పథకాలు, ఆర్బీకేలు, సచివాలయాలకు కొత్త భవనాలు.. ఇలా ఒక్కటొక్కటిగా అందుబాటులోకి వచ్చి బతుకులు బాగుపడితే ప్రతి రోజూ పండగే కదా! గతంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న మాడుగుల నేడు అన్నింటిలో మిన్నగా ఎదిగింది. గత 40 ఏళ్లలో సాధించలేనిది నాలుగున్నరేళ్లలో సాధ్యమైంది. ఈ ప్రాంత ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాత కోసం చేపట్టిన పథకాలు వారి జీవితాలను బాగుచేశాయి. తండ్రి వైఎస్సార్ హయాంలో పూర్తయిన పెద్దేరు జలాశయానికి ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రూ.84 కోట్లు కేటాయించి ఆధునికీకరణ చేపడుతున్నారు. విద్య, వైద్య రంగాల్లో అపూర్వమైన మార్పులు, ఇంటింటికీ కుళాయిలు, రెండు గ్రామాలు కలపడానికి కింతలిలో గొర్రిగెడ్డపై వంతెన నిర్మాణం, మాడుగుల వెళ్లడానికి తాచేరుపై వంతెన నిర్మాణం.. ఇలా ఎన్నో పనులు ప్రజల జీవన విధానంలో మంచి మార్పు తీసుకొచ్చాయి. 106 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



మాడుగుల అగ్రిల్యాబ్‌లో పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మాడుగులలో రూ.80 లక్షలతో ఆధునాతన వసతులతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. విత్తన నాణ్యతను పరీక్షించడం, పశువులకు సంక్రమించే వ్యాధులను గుర్తించడానికి ఈ ల్యాబ్ ఉపయోగపడుతోంది. పశువులకు 15 నిమిషాల్లో వ్యాధి నిర్ధారణ చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. విత్తన శాంపిల్స్‌ను 20 నిమిషాల్లో పరీక్షించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. ఇంతవరకు 4,209 విత్తన పరీక్షలు నిర్వహించారు. నాలుగు వేల ఆవులకు, ఏడు వేల గేదెలకు, 15 వేల మేకలు, గొర్రెలకు పరీక్షలు జరిపారు.

పేదలందరికీ ఇళ్లు

నియోజకవర్గంలో రూ.130 కోట్లతో ఇళ్లు మంజూరు చేశారు. ఇవి కాకుండా బ్యాంకు రుణాలు రూ.24.36 కోట్లు మంజూరు చేశారు. 96 జగనన్న లే అవుట్లతోపాటు 2,773 ఇళ్లు మంజూరు కాగా 617 పూర్తయ్యాయి. 2,156 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. స్వంత స్థలాలకు సంబంధించి 5,333 జగనన్న ఇల్లు మంజూరు కాగా 1740 పూర్తయ్యాయి. 3,593 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. పీఎంఏవై–జీ కింద 1380 ఇళ్లు మంజూరు కాగా 156 ఇళ్లు పూర్తయ్యాయి. 1224 నిర్మాణంలో ఉన్నాయి.



మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి బోయిల కింతాడలో సర్వాంగ సుందరంగా నిర్మాణం చేపట్టిన సచివాలయం



దేవరాపల్లి పీహెచ్‌సీ

రూ.12.14 కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధి

నియోజకవర్గంలో రెండు సీహెచ్‌సీలు, ఏడు పీహెచ్‌సీలు ఉన్నాయి. కె.కోటపాడు సీహెచ్‌సీని రూ.5.20 కోట్లతో 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. మాడుగుల సీహెచ్‌సీ, కేజే పురం, కింతలి, దేవరాపల్లి, వేచలం, పెదగోగాడ, చీడికాడ పీహెచ్‌సీలను ఆధునికీకరించారు.

106 గిరి గ్రామాలకు బంగారు బాటలు



చీడికాడ నుంచి కొండవీధికి వేసిన పక్కారోడ్డు

ఒకప్పుడు కాలినడకన వెళ్లడం కూడా సాధ్యం కాని కొండదారులను బంగారు బాటలుగా అభివృద్ధి చేశారు. నియోజకవర్గంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో 106 గిరి గ్రామాలకు చక్కని రహదారులు అందుబాటులోకి వచ్చాయి. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలో బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలు కొండలపై ఉన్నాయి. వీటికి రెండు కోట్లతో రోడ్లు వేశారు. తామరబ్బ పంచాయతీలో చినసోంపురం, గరిసింగి పంచాయతీలో చినగంగవరం, చింతలపాలెం, గరిసింగి, డోర్ర చెరువు, తాటిపూడి తదితర గిరి గ్రామాల కొండబాటలన్నీ పక్కా రోడ్లుగా మార్పు చెందాయి. మాడుగుల మండలంలో గదబూరు, డి.గొటివాడ నుంచి రాజంపేట, పనుకు గదబూరు, శరభన్నపాలెం, చినసారాడ, కింతలి నుంచి లోవ వీరనారాయణం మీదుగా గొర్రిగెడ్డ, వయా కొండవీధి, రావిపాలెం నుంచి సిరిపురం, బిల్లలపాలెం, ద్వారకానగర్, లక్ష్మీంపేట, చీడికాడ మండలంలో గుడివాడ నుంచి చెరుకు బిల్లి, జాజులపాలెం, వీరభద్రపేట నుంచి గొప్పూరు వరకు చక్కని రహదారులు వేశారు. రూ.60 కోట్లతో 520 సీసీ రోడ్లను పూర్తి చేశారు. కింతలి, వల్లాపురం గ్రామాల మధ్య గొర్రిగెడ్డపై రూ.40 లక్షలతో వంతెన నిర్మాణం జరిగింది. ఎల్.క్రిష్ణాపురం నుంచి కామకూటం గిరిజన గ్రామానికి రూ.3.40 కోట్లతో సర్వాంగ సుందరంగా రోడ్డు నిర్మించారు. ఇక మైదాన ప్రాంతాలకు వస్తే మాడుగుల మండలం డి.గొటివాడ నుంచి సాగరం కాలనీ మీదుగా మాడుగుల వరకు రోడ్డుతోపాటు తాచేరుపై వంతెన నిర్మాణానికి రూ.7.40 కోట్లు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి.

ఇది కాదా అభివృద్ధి..

రూ.31.64 కోట్లతో 78 సచివాలయాలు, రూ.18.38 కోట్లతో 78 ఆర్బీకేలు, రూ.14.13 కోట్లతో 68 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రూ.5.12 కోట్లతో 32 డిజిటల్ లైబ్రరీలు నిర్మించారు. రూ.56.70 లక్షలతో చేపట్టిన 32 పంచాయతీరాజ్ బీటీ రోడ్లు పూర్తి కావస్తున్నాయి. రూ.47.32 కోట్లతో 476 సీసీ రోడ్లు, రూ.4.64 కోట్లతో 2 వంతెనలు, రూ.54 లక్షలతో 15 కల్వర్టులు నిర్మించారు. రూ.1.75 కోట్లతో 31 కమ్యూనిటీ హాల్స్, రూ.80.60 కోట్లతో 21 ఆర్అండ్‌బీ రోడ్లు, మాడుగులలో రూ.1.40 కోట్లతో పీఆర్ వసతి గృహం, రూ.1.20 కోట్లతో శీతల గిడ్డంగులు నిర్మించారు. జల్‌జీవన్‌మిషన్‌లో భాగంగా రూ.130.91 కోట్లతో 650 పనులు చేపట్టి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మాడుగుల మండలంలో తాచేరు నదిపై రూ.3.40 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ఎ. కోత్తపల్లిలో రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాల

నాడు–నేడులో భాగంగా రెండు విడతల్లో 163 పాఠశాలలను రూ.60కోట్లతో ఆధునికీకరించారు. తాగునీరుతో పాటు టాయిలెట్స్, బెంచీలు, ఫ్యాన్స్, డిజిటల్ బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా కనువిందు చేస్తున్నాయి. బ్యాగ్, పుస్తకాలు, షూ, టైలతో విద్యాకానుక అందించడంతో సర్కారు బడులకు ఆదరణ పెరిగింది.

ఆనందంగా ఉంది



ప్రజల కళ్లలో ఆనందమే నాకు ముఖ్యం. వారు సంతోషంగా ఉండాలి. అదే నా ధ్యేయం. ఐదేళ్లలో గరిష్టంగా చేయగలిగినంత అభివృద్ధి చేశాను. మాడుగుల నియోజకవర్గంలో ఏ గ్రామం వెళ్లినా హారతులు పడుతున్నారంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహాయంతో చేసిన ప్రగతి పనులే కారణం. మారుమూల గ్రామాలు సైతం పక్కా రహదారులు, సచివాలయం, ఆర్బీకే, సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతంపై అవగాహన ఉన్న నాకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కేటాయించడంతో కొండబాటలుగా ఉన్న గిరి గ్రామాలన్నింటికీ కోట్లాది రూపాయలతో రోడ్లు వేసి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశాను. ఆదర్శ నియోజకవర్గంగా మార్పు తీసుకురావడం సంతృప్తినిచ్చింది. రానున్న కాలంలో మిగిలి ఉన్న పనులను సైతం ప్రజలు అడగకుండా నేనే స్వయంగా తెలుసుకుని పూర్తి చేస్తాను. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని బంగారు పల్లెగా మారుస్తాను. నన్ను నమ్ముకున్న నియోజకవర్గ ప్రజలకు ఆజన్మాంతం అండగా ఉంటాను.

–బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి

ఐదేళ్లలో అందిన సంక్షేమ ఫలాలు

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
అమ్మఒడి	24,845	రూ.16,45,89,418
వైఎస్సార్ పింఛన్ కానుక	46,878	రూ.36,84,84,504
వైఎస్సార్ చేయూత	21,447	రూ.43,37,42,139
వైఎస్సార్ ఆసరా	47,724	రూ.80,16,52, 250
వైఎస్సార్ రైతు భరోసా	45,138	రూ.17,48,78,119
హౌసింగ్ నేరుగా చెల్లింపు	4,942	రూ.45,74,61,373
సున్నా వడ్డీ	59,718	రూ.64,05,20,857
ఉచిత పంటల బీమా	530	రూ.4,00839
వైఎస్సార్ కాపునేస్తం	279	రూ.95,77,200
జగనన్న విద్యా దీవెన	2,174	రూ.34,51,88,394
జగనన్న వసతి దీవెన	11,991	రూ.14,29,69,772
వైఎస్సార్ నేతన్న నేస్తం	100	రూ.24,00000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	436	రూ.64,06,790
వైఎస్సార్ బీమా	609	రూ.7,16,23,148
ఇన్‌పుట్ సబ్సిడీ	3,506	రూ.65,80, 361
వైఎస్సార్ వాహనమిత్ర	2,515	రూ.4,41,78,326
సున్నా వడ్డీ పంట రుణాలు	11,706	రూ. 2,29,83,663
జగనన్న చేదోడు	2,456	రూ.35,34,90,209
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	8,322	రూ.17,22,94,421
కోవిడ్ సహాయం	4,7309	రూ.5,91,45,209
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	5,602	రూ.3,23,26,027
వైఎస్సార్ మత్స్యకార భరోసా	27	రూ.3,31,000
అగ్రిగోల్డ్	202	రూ.2,17,92,605
వైఎస్సార్ లా నేస్తం	1	రూ.60 ,000
వైఎస్సార్ కల్యాణమస్తు	225	రూ.8,89,336
అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లు	78	రూ.1,43,500
జగనన్న తోడు	5,374	రూ.2,60,68,848
జగనన్న విద్యా కానుక	983	రూ.45,72,29,797
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	16,473	రూ.18,49,03 618
జగనన్న గోరుముద్ద	19,832	రూ.11,02,27,498
90 రోజుల్లో ఇళ్ల పట్టాలు	4,649	రూ.87,35,38620